కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 15, పచ్చిమిర్చి 50 , బెండ 50, కాకర 50, దొండ 50, దోస 40, ఆలు 30, చామ 60, కీర 30, బీర 60, వంకాయ 30, గోకర 60, బీన్స్ 70, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 20, క్యారెట్ 40, చిక్కుడు 70, ఉల్లి 30(కేజీ), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సోరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 180.

దరఖాస్తులకు ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామ పరిధిలోని మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలల్లో 6, 7, 8 ,9 తరగతులలో బ్యాక్ లాగ్ సీట్ల భర్తీ కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నాగజ్యోతి బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ఈనెల 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఏప్రిల్ 20వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్ టికెట్లు ఏప్రిల్ 15న డౌన్ లోడ్ చేసుకోవాలని, పరీక్ష ఏప్రిల్ 20న నిర్వహిస్తారని, మెరిట్ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు.

రోడ్ల అభివృద్ధికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రోడ్ల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధి మైఫేర్ మార్గంలో నూతనంగా వేస్తున్న రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. రోడ్డును అభివృద్ధి చేస్తున్న మున్సిపల్ అధికారులకు స్థానికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పరీక్షా కేంద్రాల్లో స్వచ్ఛతా పనులు

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో శుభ్రత పనులు నిర్వహించి సర్వం సిద్ధం చేశారు. మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు బొల్లారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏ,బీ కేంద్రాలు, మోడల్ స్కూల్‌తో మూడు పరీక్షా కేంద్రాల్లో తరగతి గదులు, ప్రాంగణాలను శుభ్రం చేశారు. పరీక్షలు రాసేందుకు వచ్చే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని పనులు పూర్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

పటాన్‌చెరు టౌన్: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీఐ వినాయక రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు మానవ అక్రమ రవాణా, సైబర్ ఆధారిత అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. డ్వాక్రా మహిళలందరూ సైబర్ నేరాల, మానవ అక్రమ రవాణాపైన పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరస్తుల వలలో పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఎవరైనా సైబర్ వలలో పడితే వెంటనే 1930లకు కాల్ చేస్తే నగదు ఫ్రీజ్ అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, ఫైనాన్స్ డీపీఎం కొమురయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సల్మా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రుడి బ్రహ్మోత్సవాలు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని వీరన్నగూడెంలోని సుప్రసిద్ధ శైవక్షేత్రం (బొంతపల్లి) భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయ సవాహ్నిక బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఆలయ కమిటీ చైర్మన్ మద్ది ప్రతాప్ రెడ్డి దంపతులు, ఆలయ ఈఓ శశిధర్ గుప్తాతో కలిసి స్వామివారికి సుప్రభాత సేవలతో పాటు అభిషేక ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావడంతో ఆలయ ప్రాంగణాలు కిటకిటలాడాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా తరలివచ్చే భక్తుల కోసం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాట్లు చేశారు. స్వామివారి సన్నిధిలో నిత్య కైంకర్యాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, పీఠాధిపతులు, పర్యవేక్షణ సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గణేష్ గడ్డ హుండీ లెక్కింపు



పటాన్‌చెరు టౌన్: మండలంలోని రుద్రారం గ్రామ పంచాయతీ గణేష్ గడ్డ దేవస్థానంలో హుండీని బుధవారం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి, ఆలయ ఈఓ లావణ్య సమక్షంలో లెక్కించారు. 103 రోజులకు గాను రూ.28 లక్షల 20 వేలు వచ్చినట్లు ఈఓ లావణ్య, జూనియర్ అసిస్టెంట్లు ఈశ్వర్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... హుండీలో వచ్చిన ఆదాయాన్ని దేవాలయం అభివృద్ధికి ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అర్చకులు సంతోష్ జోషి, జగదీశ్వర్ స్వామి, చంద్రశేఖర్, అయ్యప్ప, సతీష్, పోలీసులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ డిజిటల్ డోర్ నెంబర్

జీఐఎస్‌తో ఇంటి సమాచారం సులభతరం • చందానగర్ సర్కిల్‌లో 570 ఇళ్ల సర్వే పూర్తి



జీహెచ్ఎంసీ చందానగర్ సర్కిల్ 21 కార్యాలయం



జీఐఎస్ సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

చందానగర్: జీహెచ్ఎంసీ పరిధిలో ప్రతి ఇళ్లు, భవనాలను గుర్తించేందుకు ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో జీహెచ్ఎంసీ సంయుక్తంగా సర్వే నిర్వహించింది. గ్రేటర్‌లో ప్రతిష్టాత్మకంగా ప్రతి ఇంటికి డిజిటల్ నెంబర్ కేటాయించేలా జీఐఎస్ (జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టం) సర్వే చేపట్టారు. ఈ సర్వే ఆధారంగా ప్రతి ఇంటికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని అధికారులు సులభంగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. గ్రేటర్ పరిధిలో 150 డివిజన్లలో చందానగర్ డివిజన్‌ను ఈ సర్వేకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. సర్కిల్ 21లో ఇప్పటి వరకు గౌతమీనగర్, శిల్పా ఎన్‌క్లేవ్, శ్రీరాంనగర్ కాలనీల్లో సర్వే పూర్తి చేశారు.

సర్వేపై ఎన్నో సందేహాలు..

చందానగర్ సర్కిల్ 21 పరిధిలో జీఐఎస్ సర్వే ప్రారంభించిన సమయంలో స్థానికులు ఎన్నో సందేహాలను వ్యక్తం చేశారు. తమ ఆస్తులకు సంబంధించిన సమాచారాన్ని ప్రైవేట్ సంస్థకు ఎందుకు ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రజలు వివరాలు చెప్పేందుకు నిరాకరించారు. ఆస్తి పన్ను భారం మోపేందుకే ఈ సర్వే నిర్వహిస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. భవనాలకు ట్యాగ్ నెంబర్ కేటాయించడం ద్వారా ఏర్పడే ప్రయోజనాలపై అధికారులు సందేహాలను నివృత్తి చేయకపోవడంతో మొదటి దశలో సర్వేకు నిరాకరించారు. బిల్డింగ్ ఫొటో, ఎన్ని అంతస్తులు ఉన్నాయి, సర్వే అనంతరం ఆస్తి పన్నును మారుస్తారేమోనని ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేశారు.

570 నివాసాలకు జీఐఎస్ సర్వే..

గత సంవత్సరం గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా చందానగర్ సర్కిల్ 21 పరిధిలో జియో ట్యాగ్ సర్వే ప్రారంభించారు. సర్కిల్ పరిధిలోని గౌతమీనగర్, శిల్పా ఎన్‌క్లేవ్, శ్రీరాంనగర్‌లలో ఇప్పటివరకు సుమారు 570 ఇళ్లకు జీఐఎస్ సర్వే పూర్తి చేశారు. వాటిలో 32 ఇళ్ల సమాచారం సరిగా లేదు. కొందరు నివాసం కోసం అనుమతులు తీసుకుని వ్యాపార సముదాయాలుగా మార్చుకున్నారు. కొన్ని భవనాలకు అనుమతులు లేకపోగా ఇంటిపన్ను కూడా చెల్లించడం లేదు. మరో సారిసదరు నివాసాలను మూల్యాంకనం చేస్తే వాటి నుంచి ప్రభుత్వానికి సుమారు రూ.10.50 లక్షల ఆదాయం వస్తుందని అధికారులు పేర్కొంటున్నారు.

జియో ట్యాగ్‌తో ఎన్నో ప్రయోజనాలు..



జీహెచ్ఎంసీలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జియో ట్యాగ్ సర్వేతో ప్రభుత్వానికి, ప్రజలకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ప్రతి ఇళ్లు, భవనాలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు. ప్రతి ఇంటికీ డిజిటల్ డోర్ నంబర్ కేటాయిస్తాం . చందానగర్ సర్కిల్ పరిధిలో 570 ఇళ్లకు జీఐఎస్ సర్వే పూర్తి చేశాం. నిరంతరంగా సర్కిల్ పరిధిలోని అన్ని డివిజన్లలో జీఐఎస్ సర్వే నిర్వహిస్తాం. – మోహన్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్, చందానగర్ సర్కిల్ 21

హెచ్‌సీయూ భూముల పరిరక్షణకు ఉమ్మడి పోరు



పరిపాలనా భవనం ఎదుట ఆందోళన చేస్తున్న దృశ్యం



హెచ్‌సీయూలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

రాయదుర్గం: హెచ్‌సీయూ భూముల పరిరక్షణకు బుధవారం క్యాంపస్‌లోని పరిపాలనా భవనం ఎదుట విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. హెచ్‌సీయూ విద్యార్థి సంఘం ఇచ్చిన పిలుపునకు పలు విద్యార్థి సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. అంతకు ముందు క్యాంపస్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పరిపాలనా భవనం ఎదుట పాటలు పాడుతూ ఆందోళన చేపట్టారు. 'హెచ్‌సీయూ భూముల జోలికి రావద్దు..హెచ్‌సీయూకు న్యాయం చేయాలి..విద్యార్థుల ఐక్యత వర్ధిల్లాలి...భూములను పరిరక్షించి తీరుతాం' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ హెచ్‌సీయూ ఉన్నత విద్యకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని, ఇటీవలే క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్‌లో స్థానం దక్కించుకుందని గుర్తు చేశారు. ప్రతిష్టాత్మక విద్యాసంస్థ హైదరాబాద్‌లో ఉండడం అందరికీ గర్వకారణంగా భావించాల్సిన ప్రభుత్వం వర్సిటీ భూములను లాక్కునేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు . రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, హెచ్‌సీయూకు, విద్యార్థులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. భూముల పరిరక్షణకోసం జేఏసీ ఆధ్వర్యంలో ఐక్య పోరాటం చేస్తామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ విద్యార్థి సంఘం అధ్యక్షుడు ఉమేష్ అంబేడ్కర్, ప్రధాన కార్యదర్శి నిహాద్, ఉపాధ్యక్షుడు ఆకాశ్, డీఎస్‌యూ అధ్యక్షుడు తుంగ రమేష్, ఏఎస్‌ఏ అధ్యక్షురాలు వెన్నెల, బీఎస్ఎఫ్ అధ్యక్షుడు, అంజి, ఇతర విద్యార్థి సంఘాల నాయకులు, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెక్నాలజీకే కాదు బిర్యానీ, చాయ్‌కి కేరాఫ్ హైదరాబాద్



కేఫ్ నీలోఫర్‌ను ప్రారంభిస్తున్న ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

రాయదుర్గం: హైదరాబాద్ నగరం టెక్నాలజీలోనే కాకుండా బిర్యానీ, చాయ్‌కు కేంద్రంగా ప్రపంచ స్థాయిలో గుర్తింపు సాధించిందని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలో ఏర్పాటు చేసిన కేఫ్ నీలోఫర్‌ను బుధవారం రాత్రి ఆయన ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచంలోనే ఒక బ్రాండ్‌లుగా గుర్తింపు సాధించిన నీలోఫర్, ఇరానీ చాయ్‌ల కు మంచి గుర్తింపు ఉందని, ఇందుకు హైదరాబాద్ కేంద్రం కావడం రాష్ట్రానికే గర్వకారణమన్నారు. ఐటీ కేంద్రాలకు చెంతనే కేఫ్ నీలోఫర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. చాయ్ అనేది మన వీక్‌నెస్‌గా మారిందని, ప్రధానంగా నీలోఫర్ చాయ్‌ని నగర ప్రజలు అలవాటు పడ్డారన్నారు. పర్యాటకంగా నగరం అభివృద్ధి చెందుతున్న తరుణంలో సందర్శకులకు బిర్యానీ, చాయ్‌లు అదనపు ఆకర్షనగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల్‌రావు కేఫ్ నీలోఫర్ మేనేజింగ్ డైరెక్టర్ అనుముల శశాంక్, కేఫ్ వ్యవస్థాపకుడు అనుముల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

22న ఆరాధన మహోత్సవం

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లిలోని ద్వాదశ జ్యోతిర్లింగ భువనేశ్వరి దేవస్థానంలో పుల్లూరు నారాయణదాసు 25వ ఆరాధన మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయన కమిటీ చైర్మన్ గొట్టిముక్కల నాగేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మహోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఉదయం పాదుకాపూజ, క్షీరాభిషేకం, పుష్ప బిల్వార్చనలు, భజనలు, వేద పారాయణం కార్యక్రమాలు జరుగనున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని తెలిపారు.

మిగిలిన పనులు పూర్తి చేస్తాం

కార్పొరేటర్ నబిహా బేగం

మోతీనగర్: బస్తీలు, కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. బుధవారం వివేకానందనగర్ కార్యాలయంలో అన్ని బస్తీ, కాలనీల సంక్షేమ సంఘం అధ్యక్షులు, సీనియర్ నాయకులతో కలిసి బస్తీ అభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో అన్ని బస్తీ, కాలనీల్లో మౌలిక వసతులను కల్పిస్తామన్నారు. మిగిలిన పనులను దశల వారీగా పూర్తి చేస్తామని, ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

రోడ్డు మరమ్మతు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ గజారావు భూపాల్

గచ్చిబౌలి: వర్షా కాలంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతున్న వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద మరమ్మతు పనులను సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ గజారావు భూపాల్ బుధవారం పరిశీలించారు. వర్షా కాలంలో మాదాపూర్‌లోని నెక్టార్ గార్డెన్ వద్ద భారీగా వరద నీరు చేరుతుండటంతో జూబ్లీహిల్స్ నుంచి ఐటీ కారిడార్‌కు వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసుల సమన్వయ సమావేశంలో వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించారు. ఈ క్రమంలో నెక్టార్ గార్డెన్ వద్ద చేపట్టిన మరమ్మతు పనులను ఎలక్ట్రికల్ అధికారులతో ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ పరిశీలించారు. వేసవి ముగిసేలోగా పనులు పూర్తి చేయాలని, వరద నీరు చేరకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ సాయి మనోహర్, ఏసీపీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్ గ్యాలరీలో శిల్పాల ప్రదర్శన ప్రారంభం





స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఆకట్టుకుంటున్న శిల్పాలు

మాదాపూర్: కళాకారుడు రాబిన్ డేవిడ్ రూపొందించిన శిల్పాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో బుధవారం స్కల్ప్టింగ్ వాయిడ్స్ పేరిట ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాకారుడు రాబిన్ డేవిడ్ రూపొందించిన స్కల్ప్చర్స్ సందేశాత్మకంగా ఉన్నాయని కొనియాడారు. ప్రదర్శనలో 30 స్కల్ప్చర్స్‌ను అందుబాటులో ఉంచారు. ఈనెల 30 వరకు ప్రదర్శన సందర్శకులకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు అమన్ ప్రీత్ కౌర్ తెలిపారు.

హరిత నిర్మాణాలపై దృష్టి సారించాలి



'ఎస్కీ'లో నిర్వహించిన సదస్సులో పాల్గొన్న అతిథులు

రాయదుర్గం: నిర్మాణ రంగంలో స్థిరమైన ఆవిష్కరణలకు గ్రీన్ బిల్డింగ్స్ ఆవశ్యకత ఉందని ఇండియన్ జియోటెక్నికల్ సొసైటీ అధ్యక్షుడు, ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా జాతీయ మండలి సభ్యుడు డాక్టర్ అనిల్ జోసెఫ్ అన్నారు. బుధవారం గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీలో 'సివిల్ ఇంజనీరింగ్‌లో నూతన టెక్నాలజీని ఉపయోగించుకుని స్థిరంగా ఉండే గ్రీన్ బిల్డింగ్స్ నిర్మాణాల ఆవశ్యకత' అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణంలో వెలుతురుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. భారత దేశం మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగల దేశంగా అవతరించబోతున్నదని దేవశ్రీ ఇస్పాత్ స్టీల్ ప్రాడక్ట్స్ అధినేత రాజీవ్‌బిష్ట్ అన్నారు. సివిల్ ఇంజనీరింగ్‌లో వస్తున్న నూతన మార్పులతో దేశంలో గ్రీన్ బిల్డింగ్స్ నిర్మాణాల ఆవశ్యకత ఉందని, పర్యావరణ పరిరక్షణకు హరిత నిర్మాణాలు అవసరమన్నారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్ కారణంగా ఏర్పడుతున్న ప్రమాదాలను తగ్గించుకోవడంపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో సివిల్ ఇంజనీర్లు, ఆర్కిటెక్టు నిపుణులు, వివిధ నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

విదేశీ విద్యపై అవగాహన అవసరం

మణికొండ: విదేశాలకు వెళ్లే విద్యార్థులు అక్కడి యూనివర్సిటీలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని శ్రీదేవి మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నర్మద అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లిలోని కళాశాలలో బుధవారం నిర్వహించిన గ్లోబల్ ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో ఆమె పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుత పరిస్థితిలో విదేశాలలో ఉన్నత విద్య చదివితే మంచి సంస్థలలో ఉద్యోగాలు లభిస్తున్నాయన్నారు. అలాంటి విదేశీ విద్యను విద్యార్థుల దరి చేర్చాలనే ఉద్దేశంతో అనేక విదేశీ సంస్థలను ఇక్కడకే రప్పించి వారి వివరాలను తెలియజేస్తున్నామన్నారు. యూఎస్ఏ, యూకే, యూరప్, ఆస్ట్రేలియా దేశాలకు విశ్వవిద్యాలయాల ప్రతినిధులను ఒకే చోట చేర్చటంతో తమ విద్యార్థులు వారికి నచ్చిన యూనివర్సిటీలను ఎంచుకునే అవకాశం కలిగిందన్నారు. ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు ఎకోల్ డి కామర్స్ డి లియోన్ విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు.


బీసీ రిజర్వేషన్ల బిల్లు చరిత్రాత్మకం



మాట్లాడుతున్న జగదీశ్వర్ గౌడ్

చందానగర్: రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బిల్లు చారిత్రకమని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ అన్నారు. బుధవారం బీసీ రిజర్వేషన్ల బిల్లుపై హర్షం వ్యక్తం చేస్తూ నాయకులు, కార్యకర్తలతో సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణన బీసీలకు ప్రజా ప్రభుత్వం ఇచ్చిన ఆస్తి అన్నారు. ఈ ఆస్తిని కాపాడుకోవాల్సిన బాధ్యత బీసీలపై ఉందన్నారు. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంపై ప్రజలందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అశోక్ గౌడ్, మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, శేరిలింగంపల్లి నియోజకవర్గ కో ఆర్డినేటర్ రఘునందన్‌రెడ్డి, నాయకులు మహిపాల్ యాదవ్, యాదగిరి గౌడ్, వీరేశం గౌడ్, ఉరిటి వెంకట్‌రావు, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

మూగజీవాలకు ఆసుపత్రులు ఉండాలి




మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

మణికొండ: హైదరాబాద్ లాంటి మెట్రో నగరంలో పెట్స్‌ను పెంచుకునే వారి సంఖ్య పెరుగుతుందని, వాటికి సరైన వైద్య సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఆధునిక ఆసుపత్రి రావటం సంతోషమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. నగర శివారు నార్సింగి మున్సిపాలిటీ గండిపేట రోడ్డు, కోకాపేటలో బుధవారం రాత్రి ఆయన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఏర్పాటు చేసిన 'పెట్ ఫస్ట్' మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, డి.శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావుతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యేలు టి. ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీ, మురళీ నాయక్, వివేక్ వెంకటస్వామి, రాజ్ ఠాకూర్, ఆసుపత్రి ఎండీ పద్మజ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

మరొకరికి గాయాలు



రామకృష్ణ(ఫైల్)

గచ్చిబౌలి: ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ఒక ప్రాణాన్ని బలి తీసుకుంది. ఎల్‌సీ తీసుకోకుండానే ట్రాన్స్‌ఫార్మర్ కోసం ఇనుప స్తంభం పాతుతుండగా విద్యుదాఘాతానికి గురై ఎలక్ట్రీషియన్ మృతి చెందగా, మరొకరు గాయ పడిన ఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొండాపూర్‌లోని శ్రీరామ్‌నగర్ ఏ బ్లాక్, ప్లాట్ నెంబర్ 347 యజమాని విజయ్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులను ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ రఘుబాబుకు అప్పగించాడు. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం ఇటుకలపల్లి గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్ బత్తిని రామకృష్ణ(32) రాంబాబు, రామ్‌కుమార్ అనే వ్యక్తులతో కలిసి బుధవారం ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాలు పాతేందుకు శ్రీరామ్‌నగర్ కాలనీకి వెళ్లాడు. మధ్యాహ్నం ఇనుప స్తంభాన్ని పాతుతుండగా 11 కేవీలైన్‌కు తాకడంతో విద్యుదాఘాతానికి గురై రామకృష్ణ అపస్మారక స్థితికి చేరుకోడంతో అతడిని కొండాపూర్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. గాయపడిన రాంబాబును కూకట్‌పల్లిలోని రాందేవ్ ఆస్పత్రికి తరలించారు. కాంట్రాక్టర్ రఘురామ్ ఘటన జరిగి గంటలు గడిచినా పట్టించుకోలేదని మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఎల్‌సీ తీసుకోకుండానే పనులు ..

కాంట్రాక్టర్ రఘురామ్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం ఎల్‌సీ తీసుకోవాల్సి ఉంది. ఈ విషయమై వైట్‌ఫీల్డ్ ఏఈ కార్యాలయంలో సంప్రదించగా ఉన్నతాధికారుల అనుమతితో శనివారం ఎల్‌సీ ఇస్తామని చెప్పారు. అయితే అతను అప్పటివరకు ఆగకుండా పనులు చేపట్టడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువుల పరిరక్షణే ధ్యేయం



సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్: నియోజకవర్గంలోని అన్ని చెరువులను సుందరీకరించి గ్రామీణ వాతావరణం నెలకొల్పడమే ధ్యేయంగా పనిచేస్తున్నానని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. బుధవారం ఆయన మియాపూర్ డివిజన్ పరిధిలోని పటేల్ చెరువు, పెద్దకుడి చెరువు, రామసముద్రం కుంట, నాయినమ్మకుంట చెరువు సుందరీకరణలో భాగంగా నెక్సస్ సెలెక్ట్ మాల్స్ కంపెనీ, ఐజీయూఏస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా మల్లిగావాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సంస్థ ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలోని 64 చెరువులను అభివృద్ధి చేసి సుందరీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. చెరువుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని చెరువులను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తున్న సంస్థ ప్రతినిధులను అభినందించారు. త్వరలో మియాపూర్ డివిజన్ పరిధిలోని పటేల్ చెరువు, పెద్దకుడి చెరువు, రామసముద్రం కుంట, నాయినమ్మకుంట చెరువుల రూపురేఖలు మారనున్నట్లు తెలిపారు.

కబ్జా కోరల్లో గంగారం పెద్ద చెరువు

చందానగర్‌లోని గంగారం పెద్ద చెరువు ఆక్రమణదారులకు అడ్డగా మారిందని సుమారు ఐదెకరాల భూమిలో మట్టిపోసి ఆక్రమణలకు యత్నిస్తున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. సుందరీకరణలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గంగారం పెద్ద చెరువును మట్టితో పూడ్చి కబ్జాకు ప్రయత్నిస్తున్నారన్నారు. సిబ్బంది దగ్గరుండి మరీ కబ్జాదారులకు సహకరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం చెరువుల అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, స్వచ్ఛంద సంస్థల సహకారంతో చెరువుల సుందరీకరణ పనులు కొనసాగిస్తున్నానని తెలిపారు. చెరువులు అన్యాక్రాంతమవుతున్నా ఇరిగేషన్, రెవెన్యూ, జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారులు ఎందుకు స్పందించడం లేదన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు నిషాంత్ దుగ్గల్, హర్ష భద్ర, నిఖిత్‌కుమార్, ఫణీంద్ర, రామ్‌బొట్ల, చైతన్య, నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.